కావి తిరిగి పరిశుభ్రం చేస్తే ఏలా ఉంటుందనుకున్నారు ఈవిగ్ః బ్రహ్మాండంగా కాటుకపిట్టలా వుంటుంది" అని సిరియాళరావు చేతిలోంచి ఆ విగ్గున్నూ, విగ్గుతోకూడా ఓ వరహా రొక్కమున్నూ అందుకుంటూ—"పిల్లా! వెళ్లొస్తా" నంటూ శ్యామలాంగికేసి చిరునవ్వు నవ్వుతూ, పిన్ని వీధమూల మలుపు తిరిగింది. ఆకాశపు తూరువు వారగునే అరుణకాంతులు ఆమె పెదవుల్ని ఉదుర్కొన్నాయి!

## ఉప్పాలం

గుంటూరు రేపల్లె, చీరాల, బందరు ఆప్రాంతపు సముద్రతీరపు వంచకు "ఉప్పాలం" అని పేరు. చవుడుదేరి నేల మృదువుగానుండి ఉప్పుజాదతో కూడుకొన్నదై చాలబాగము పెద్దబయలుగా తోస్తూ నీరు గాలితోను మైకంగా చల్లందనం, మన కనురెప్ప లెగయ గుప్పిస్తుంది, దూరదూరంగా ఎత్తైన సరుకుమొక్కలచాళ్లు తూగుతూ వినువాడెంత పరధ్యానంగా వున్నా తమ సంగీతాన్ని వినిపిస్తూవుంటాయి. అక్కడక్కడ నివాసయోగ్యాలుగా భావించి మానవులు నిర్మించుకొన్న ఊళ్లు రెండుకోసుల్లో మూడుకోసుల్లో అడ్డదిడ్డపు తోవలతో అల్లుకుపోయి కనబడతాయి. ఆ గ్రామాదుల పేళ్లుకూడా సముద్రతీరప్రాంతాన్ని బట్టి పుట్టివుంటాయి అవి అనుకొనేటట్టుగా—ఇసుకపల్లె, దిండి, కట్టవ, యిలా పిలవబడుతూవుంటాయి. కొండల్లోపుట్టి కొండల్లో పెరిగిన కోయవాని కలాంటి తావొకటి భూమ్మీద వుంటుందా అని అనిపించకమానదు.

కట్టవ! అది ఒకానొకప్పుడు సముద్రానికి చెలియలి కట్టగా పనిచేసి వుండాలి! దాని పీఠుల్లోనికి విసర్గమైన ఉప్పునీటి వెల్లువ అంతఎత్తు లేచిపడి ప్రవహించి వెనక్కు తగ్గివుండాలి! కట్టవ! కుగ్రామం. ఒకటో రెండో వేపచెట్లు, రెండో మూడో తాటిచెట్లు దాని గుర్తింపులు; పదిపదేను ఇళ్లు దాని సొంపులూ వంపులూ కనిపింపులూను. చుట్టూ ఆరుదల బయలు. తెమలని తెరపి. ఇప్పుడు దాన్ని మోసి ఏ సముద్రమూలేదు, సముద్రము దాన్ని విడిచిపెట్టి ఏనాడైందో! మానవు డెరుగడు.

అయినా మిక్కిలి ముసిలిమావిసినొకడు నాకగపిస్తూ వున్నాడు, ఆ వూరినుండి వెలువడి పెద్దబయలున నడుస్తూ. తల వెండ్రుకలూ కనుబొమ్మలూ నెరిసిపోయినయి. అయినప్పటికిన్ని వానివొళ్ళు భూచ్ఛాయలా నలుపుదేరి, కళ్ళల్లోని రక్తపుజీరలు అగ్నిజ్వాలల్లా కాంతిమీరి, కాగి చల్లారనివ్యక్తిలా గగపించేడు.

"ఎందాకా పోతున్నావు తాతా?" అన్నాను. "సముద్రపు వంచకు" అన్నాడు. మరి వొకరికొకళ్ళం మాట్లాడుకోకుండానే అతను ముందు నేను వెనక. అతను ముందు నేను వెనక, నన్నని సందంట పోతూన్నమాదిరిగా నిబ్బరపుచూపుతో వెళ్లిపోతున్నాం.

కార్తి - కత్తిరి కొకింత పిదపో, రోహిణి కొకింతముందో చెప్పలేనికాని, కాలం అప్పట్లో మండువేసంగి అనిమాత్రం చెప్ప గలను. భూమేకాకుండా ఆకాశంకూడా కనకనమంటూవున్నట్టుగా వుంది కుతకుత ఉడికిపోతూవుంది.

అంత ఎండలో, అంత మండువేసంగిలో ఎందు కానడక అంటే అత డేంచెప్పేవాడో! నేను అతన్ని అడగలేదు. కాని అతడు వెనుదిరిగి నన్నడిగేడా నేను ఒక్కటేమాట చెప్పదలచు

కొన్నాను. "నీవు నడుస్తున్నావు. నీ వెనకాలే నేను నడవాలని నాకు బుద్ధిపుట్టింది. నేను నడుస్తున్నాను. నాకేమినీళ్ళ ఎండ కనిపించడంలేదు" అని ఘంటాపథంగా చెప్పదలచుకొన్నాను.

నిశ్శబ్దదేవత మమ్మల్నిద్దర్ని ఆ ఘడియ తనకు అనుచరులుగా గావించుకొని నడిపిస్తూవుంది. ఏలా మాటాడుకుంటాం పరస్పరం?

సూర్యునియొక్క ఏటవాలు కిరణాలు పగలాపైని జాం జాంన్నరకంటె ఎక్కువ ఉండనేరదని అనిపిస్తున్నాయి. నేలంట ఎండమావులు వ్యాప్తమై అక్కడికి సముద్ర మనతిదూరం అనట్టు కంటికి తట్టిస్తున్నాయి.

ఆ ప్రాంతంలో సముద్రతీరాన్ని "ఉప్పాలం" అని ఏలా వాడుతారో "ఎండమావి"ని "అగ్గిసాలు" అని అనడం పరిపాటి. మే మిద్దరం ఒక ఎండమావి దాటినాము. ఎండమావి దాటడమేమిటి? అది దానంతటదే మాముందు ఒత్తిగిలి వెనక్కు జరిగింది అని అనవచ్చును.

"అగ్గిపాల" ఒయ్యారం జగన్మోహనాకారం అని అనుకోండి. అవిగో నీళ్ళున్నట్టుగా తోపిస్తూ నీళ్ళు కనిపించవు. నీలనీలాంబుధిమల్లేనే అలోలంగా అగపిస్తుంది. కాని కెరటం యొక్క హోరు శూన్యము.

మేం నడుస్తూన్నకొద్దీ ఎండమావి స్వరూపం అంతగా మారకపోయినా నేల మారింది. రయితు లక్కడక్కడ పండించి కోసికొన్న చోడిమళ్లుదాటి, ఉప్పుటేళ్ళవరకు పచ్చిక బయిళ్ళ నడవసాగినాము. అవి దాటి క్రమంగా యిసకమిఱ్ఱుల కెక్కినాము. మిఱ్ఱులు మైదానంగా కొంతలెక్క నడిచినాము.

ఆ మైదానపుటంచునే సరుకు తోపులు రంయిరంయి సముద్రపు గాలికి వూగిసలాడుతూ గోచరించినాయి. అంతటితో మరి మృగ తృష్ణలు రావని నేను వో నిర్ధారణకు వచ్చివేసినాను.

నాముందు నడుస్తూవున్న అతడు సముద్రం అదిగో చూచినావా? దొరా!" అన్నాడు ఉత్సాహపూరితుడై—ఎందుకు అతనికింత సంతోషం కలగాలి ఆ సముద్రం చూడగానే? అత డెందుకు తలపోయాలి సముద్రం చూద్దానిగ్గాను, దారి తెలీక ఆతన్ని నేను వెంబడించినానని? అతడు నాకు మృగదృష్ణనే సముద్రం అని చూపక సముద్రాన్నే సముద్రం అని ఎందుకు చూపించాలి? ఇలాగ్గా పరిపరివిధాలుగా ఆలోచింప దొడగింది నా మనస్సు-వాని చూపుడు వ్రేలినే సముద్రాన్ని సందర్శిస్తూ.

గబుక్కున యిసకమైదానం దిగినట్టయింది. మా కాలి కింద ఇసకంతా చెమ్మదనమే తీరపుటిసకరేణువు ఏకమొత్తంగా కెరటాలదెబ్బలు తింటూ జిలజిలమంటూ వుంది.

ఆ సన్నని సున్నితపు తేమదేరిన యిసకరేణువులమీద వేలకువేలుగా కోట్లకుకోట్లుగా ఎర్రపీతలు బాటితపూతల్లే విశ్ర మించి యున్నాయి.

సరిగా అదే ముహూర్తం! భానుమండలం ఈశాన్య దిక్కుగా ఓ మేఘంజొచ్చి అందులోనుంచి క్రిందికోమూలకు సముద్రమున్న నల్లని జీమూతంలాంటి సరుకుతోటయున్నా కలిసిపోయిన ట్టగపించే వాకానొక మలుపులోనికి తన కాంతి పుంజాన్ని పింజెవోసి దిగజార్చినట్లు వాల్చింది. క్రమంగా బింబం మేఘం వెలువడి జారిపోతూ అపరిమితమైన అరుణచ్ఛవిని విరాజిల్లింది. తాత్కాలికపు తుదిసంజయొక్క శాంతిప్రకాశం

ధాత్రి నలముకొన్నదై ప్రత్యేకత నక్కడ ఆ ఎర్రపీతలయొక్క ఎర్రదనాన్ని ఇనుమడింజేస్తూ వుంది.

"అలికిడి సేయకుండా రా! దొరా!" అన్నాడు తాత. "ఏం?" అన్నాను. "ఆ ఎర్రపీతలన్నీ యిట్టే బొత్తల్లోదూరి మనకు మరి దొరకవు. నేను వాటికోసమే యింత దూరం నడిచి వచ్చింది" అన్నాడు తాత. అంటూనే పొట్ట ముమ్మడతలు పడిపోయేటట్టుగా వొదిగి వంగి వాలి ఓ పీతచాయకు సాగిలబడి దాన్ని పట్టుకో చేతులు సాచినాడు. పీత వాని గుప్పిట చిక్కింది. గుప్పిలి నొక్కాడా? చచ్చిందే కటక్కని!

దాని సూదుల్లాంటి మిడిగ్రుడ్లు వాడివ్రేళ్ల సందుల్లోనుంచి కవిపిస్తూ యింకా మూతవడ్డం విడివడ్డం మానలేదు. దాని పదికాళ్లు పదికాళ్లగానే వున్నాయి.

నేను వానితో "ఆ చిన్న పీత నెందుకు పట్టుకు చంపుతావు? అదిగో ఆ పెద్దపీతను పట్టుకో" అని తప్పెట తట్టాను. నా ఆ తప్పెటతో తీరాన్ని వున్న సమస్త జీవరాసులు దాక్కుండి పోయినాయి. "సమస్తజీవరాసులు" అనడంలో అర్థముంది. వానిచేతిలోని చిన్నపీతకూడా, యాదాలాపంగా నామాటపుచ్చుకు ఆ వృద్ధుడు విడిచిపెట్టడంవల్ల స్వేచ్ఛనుపొంది చెంతనే ఓబొరియ చేసుకు మటుమాయమైంది. కాబట్టి "సమస్త జీవరాసులు" అనడంలో అర్థముంది.

ముసిలివాడు నిర్ఘాంతుడౌతూ, ఆ నిర్ఘాంతరూపంలోనే నిరాశ చూపుతూ "ఏది నీవన్నపీత? అన్నింటినీ నీ తప్పెట చేత చెదరగొట్టినావు దొరా!" అన్నాడు.

"అదిగో! ఎర్రెర్రగా — ఆ సరుకు మొక్కలున్న కెరటాలున్న మమైకంగావున్న ఈశాన్య దిఙ్మండలంలోనికి

చారుచుకుపోతూవున్నదే—అదే నేనన్న పీత. దాన్ని వెంటాడించు" అన్నాను.

"అది పీతగాదు దొరా! సూర్యభగవానుడు! రోజూ ఆలా క్రుంకుతూనే వుంటాడు స్వామి! రోజూ ఆ స్వామిని పట్టుకోబోయి పట్టుకోలేక ముందుకుపడి విరిగి ముక్కలైపోతూనే వుంటుంది ఆలా ఆమూల ఆ కెరటం! ఎవరికీ దొరకని పెద్దపీత ఆ బింబం!" అన్నాడు నామాట మిక్కిలి రెట్టించి అమ్మహావృద్ధు.

వాని ఆకలిడొక్క లింకా లోపలకు దించుకుపోతువున్నా "సముద్రాని కెంత తీరని ఆకలో!" అని ఉచ్చైశ్రుతంగా అనుకున్నాడు.

కదలికరళ్ల ప్రతిబింబించినట్లే ఆ దయాళుని కళ్ల నానిమేషం సాయం సంధ్యారాగం ప్రతిఫలించింది. ఉప్పొంగ మంతా చిట్టిజాబిల్లి కితకితలెట్టినట్టు కిలకిలా నవ్వింది.

## ఉడుత ఉసురు

"వెలయంగ నశ్వమేధంబులు వేయును
నొక్క సత్యమును దులనిడి—" అన్న

పద్యములోని తూనిక జ్ఞాపకం వస్తుంది నాకు. రాణ్మహేంద్రవర నగరమునందు గొప్ప ప్రహారీమధ్యను నవీన నాగరకచిహ్నముగ నెలకొల్పబడిన పురవనము దాని యెట్టయెదుట సనాతన ప్రౌఢిమ విలసిల్లే విశాలమైదానమ్మీది పురాతన వటవృక్షము—రెండింటినీ తలపున గొన్నప్పు డోహో! ఎన్ని పురవనములైతే నొక్క ఆ వటవృక్షంతో సాటిరాగలవు అని దాన్నిగురించే యోజిస్తూ వుంటాను.